క్లుప్తంగా

వేలం ద్వారా రూ.7.63 లక్షల ఆదాయం

బిక్కవోలు: మండలంలోని శ్రీలక్ష్మీ గణపతి స్వామివారి ఆలయంలో వేలం ద్వారా ఏడాదికి రూ.7.63 లక్షల ఆదాయం వస్తుందని ఆలయ ఈవో రామలింగ భాస్కర్ తెలిపారు. సోమవారం ఆలయం వద్ద బహిరంగ వేలం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొబ్బరి చెక్కలకు రూ.3,75,000, పటికీ బెల్లం, బెల్లం ద్వారా రూ.3,00,000, దేవుడికి సమర్పించే వస్త్రాల ద్వారా రూ.88,000 ఆదాయం వస్తుందని చెప్పారు. వేలం పాట కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాల్లో 320 మందికి సేవలు



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు

సీతానగరం: స్థానిక కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో శ్రీరామకృష్ణ మఠం, వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రుల ఆధ్వర్యంలో సోమవారం సాధారణ, కంటి వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు సత్యం రమేష్‌బాబు, యన్నమనేని రామచంద్రరావు, రాయుడు శ్రీనివాస్ 320 మందికి వైద్యసేవలు అందించారు. 15 మందికి క్యాట్‌రాక్ట్ ఆపరేషన్లు అవసరమని గుర్తించి, ఉచిత ఆపరేషన్ల కోసం ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల, యన్నమని వెంకట నారాయణ, చంటిబాబు, సురేష్ బాబు, కె.విజయ్ కుమార్, కె.శ్రీనివాసరావు, ఎస్.వెంకటలక్ష్మీ పాల్గొన్నారు.

స్పందనకు రెండు వినతులు



రంగంపేట స్పందనలో వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ అమ్మాజీ

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో రెండు వినతులు అందాయని తహసీల్దార్ వాకాడ అమ్మాజీ తెలిపారు. కోటపాడు శివారు రామేశంపేట గ్రామానికి చెందిన బొట్టు శ్రీనివాసరావు తన స్థలాన్ని పెదపాటి సూర్యారావు ఆక్రమించి ఇల్లు నిర్మించారని, కోటపాడు గ్రామానికి చెందిన వ్యక్తి తనకు చెందిన 1.02 సెంట్ల భూమి ఆన్‌లైన్ చేసి పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇప్పించాలని మరొక వినతి అందించారని ఆమె తెలిపారు.

రాజ్యాధికారం దిశగా బీసీలు ఉద్యమించాలి



రంగంపేట బీసీ సమావేశంలో పాల్గొన్న నాయకులు

రంగంపేట: రాజ్యాధికారం సాధించే దిశగా బీసీలంతా ఐక్యమత్యంతో ఉద్యమించాలని బీసీ నాయకులు గుత్తుల సుబ్రహ్మణ్యం, గరజాలపు వీరభద్రరావులు పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన రంగంపేటలో సోమవారం బీసీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారిద్దరూ మాట్లాడుతూ బీసీల్లో ఐక్యత లేకపోవడం వల్ల రాజకీయంగా, సామాజికంగా సరైన న్యాయం జరగడం లేదన్నారు. అందుకే కులాలు వేరైనా బీసీలంతా సంఘటితం కావాలన్నారు. కార్యక్రమంలో రంగంపేట మండల బీసీ సంఘం అధ్యక్షుడు కేతా సత్తిబాబు, పలువురు మండల స్థాయి బీసీ నాయకులు పాల్గొన్నారు.

నేడు బ్రోమోడయోలిన్ మందు పంపిణీ

అనపర్తి: మండలంలోని గ్రామాల్లో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి బి.సురేష్‌కుమార్ సోమవారం విలేకరులకు తెలిపారు. సామూహిక ఎలుకల నిర్మూలనలో భాగంగా ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న బ్రోమోడయోలిన్ మందును మంగళవారం పంపిణీ చేస్తామన్నారు. రైతులంతా ఒకేసారి ఎరను చిన్న పొట్లాలు కట్టి చేలల్లో ఎలుకలు తిరిగే ప్రదేశాల్లో ఉంచితే ఎలుకల ఉధృతి తగ్గుతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏవో సురేష్ పిలుపునిచ్చారు.

సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

అనపర్తి: తమకు అందిన సమాచారం ఆధారంగా మండలంలోని పులుగుర్త శివారులో నాటు సారా విక్రయిస్తున్న మందపల్లి సత్తిబాబు అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ పి.అప్పారావు సోమవారం తెలిపారు. అతడి నుండి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

ఆరోగ్య పరిరక్షణకు పరీక్ష



కొంకుదురులో పరీక్షలకు చదువుకుంటున్న విద్యార్థులు

- టెన్త్ పరీక్షలు సమీపిస్తుండటంతో చదువుపైనే విద్యార్థుల దృష్టి
- నిద్ర, పౌష్టికాహారానికి ప్రాధాన్యమివ్వాలని వైద్యుల సూచన

బిక్కవోలు: పరీక్షలు.. ఏడాది శ్రమ ఫలితానికి ప్రామాణికం. అందుకే పరీక్షలు సమీపించే కొద్దీ విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యా బోధకులు ప్రత్యేక దృష్టి సారిస్తారు. పరీక్షలంటే కొందరు విద్యార్థులకు భయం ముంచుకొస్తుంది. అందుకే కొందరు విద్యార్థులు ఆందోళనతో మానసిక ఒత్తిడికి గురై అధిక సమయం చదువుతుంటారు. అయితే ఈ సమయంలో నిద్ర, పౌష్టికాహారానికి ప్రాధాన్యమివ్వాలని వైద్యులు సూచిస్తున్నారు.

ప్రణాళికతో మంచి ఫలితాలు

ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి మే 18 వరకు జరగనున్నాయి. ప్రతి రోజు ఒక సబెక్టుపై పరీక్షలు నిర్వహిస్తున్నారు. అలాగే ఈ నెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకూ కీలక పరీక్షలతో పాటు ప్రీ పబ్లిక్ పరీక్షలు ఉండే అవకాశముంది.పరీక్షల సమయంలో విద్యార్థులు చదువుతో పాటు యోగా కూడా చేయాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రత్యేక ప్రణాళికతో విద్యార్థులు ముందుకు సాగితే ఒత్తిడి లేకుండా పరీక్షలు పూర్తి చేయొచ్చంటున్నారు. పరీక్షల సమయంలో ఆరోగ్య పరిరక్షణ ఎంతో కీలకమన్నది మరిచిపోవొద్దని సూచిస్తున్నారు. అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో పదో తరగతి విద్యార్థులు 4,863 మంది ఉన్నారు.

అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో మండలాల వారీగా విద్యార్థుల వివరాలు

మండలం	విద్యార్థులు వివరాలు
అనపర్తి	805
బిక్కవోలు	637
పెదపూడి	570
రంగంపేట	612
రాజానగరం	877
సీతానగరం	474
కోరుకొండ	888
	4,863

మానసికంగా దృఢంగా ఉండాలి



పరీక్షల సమయంలో విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా మానసికంగా దృఢంగా ఉండాలి. మంచి ఆహారం ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకుతుంది. తగినంత నీరు తాగాలి. తల్లిదండ్రులు విద్యార్థులపై శ్రద్ధ చూపాలి. టీవీ, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచాలి.

– తేతలి రామారెడ్డి, మానసిక వైద్యులు, అనపర్తి

అశ్రద్ధ చేయొద్దు



ఆహారంతో పాటు రోజుకు కనీసం మూడు లీటర్ల నీరు తాగాలి. పరీక్షల కాలంలో ప్రతి క్షణం విలువైనదే. చదువుతో పాటు తగిన విశ్రాంతి కూడా అవసరమని గుర్తించాలి. చిన్నపాటి తలనొప్పి, జ్వరం వచ్చినా ఏకాగ్రత దెబ్బతింటుంది. సమస్య పెద్దది కాకుండా వైద్యులను సంప్రదించడం మంచిది.

– డాక్టర్ రాజీవ్, బిక్కవోలు పీహెచ్‌సీ వైద్యులు

కలసి పనిచేద్దాం – అభివృద్ధికి కృషి చేద్దాం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- బొల్లెద్దుపాలెం సర్పంచ్‌తో పాటు వంద కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా

మధురపూడి: అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును గుర్తించి వైఎస్సార్ సీపీలోకి చేరిన వారికి సముచితస్థానం కల్పిస్తున్నామని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. టీడీపీకి చెందిన కోరుకొండ మండలం బొల్లెద్దుపాలెం సర్పంచ్ కురుమెళ్ల వెంకట రామకృష్ణ, ఉప సర్పంచ్ అలబాని ఏసుతో పాటు వంద కుటుంబాలు సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారిని ఎమ్మెల్యే రాజా సాదరంగా ఆహ్వానించి పార్టీ కండువా కప్పారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ అభిప్రాయ బేధాలను విడిచిపెట్టి అభివృద్ధి కోసం అందరం కలసి కృషి చేద్దామని పిలుపు నిచ్చారు. జగనన్న ప్రభుత్వంలోనే గ్రామాభివృద్ధి జరిగిందని, మౌలిక వసతులు కల్పించబడ్డాయన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులైన వారంతా ఆయా పార్టీల నుంచి బయటకు రావాలని పిలుపునిచ్చారు. అలాగే కష్టకాలంలో పార్టీకి వెన్నెంట ఉన్న నాయకులు, కార్యకర్తలకు మంచి గుర్తింపు నివ్వడం జరుగుతోందన్నారు. గత టీడీపీ రూ.45.08 లక్షలు మాత్రమే ఖర్చు చేసిందని, కాగా ఈ ప్రభుత్వం కేవలం మూడేళ్లలో రూ.4.12 కోట్లతో అభివృద్ధి పనులు నిర్వహించినట్టు తెలిపారు. గ్రామంలో రైతు భరోసా, జగనన్న అమ్మఒడి, ఆసరా, చేయూత, చేదోడు, పింఛన్లు తదితర సంక్షేమ పథకాల ద్వారా ప్రజల ఆర్థిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేసిందన్నారు. సర్పంచ్ వెంకట రామకృష్ణ కోరిక మేరకు అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వడం జరుగుతోందని, ఇప్పటికే 141 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చినట్టు తెలిపారు. శ్మశాన వాటిక అభివృద్ధి, సీసీ రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ క్రొవ్విడి సత్రాజు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, కో కన్వీనర్ గణేశుల పోసి, సర్పంచుల సమాఖ్య మండలాధ్యక్షుడు కడియాల పాపారావు, పార్టీ నాయకులు డేగల బాబులు, అల్లి సింహాచలం, పూసర్ల మహేష్, రమేష్ పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారమే ధ్యేయం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- బొల్లెద్దుపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం



బొల్లెద్దుపాలెంలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకుని, పరిష్కరించడమే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమ ఉద్దేశమని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం బొల్లెద్దుపాలెంలో సోమవారం రాత్రి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. తొలుత గ్రామదేవత గొలుగులమ్మను దర్శించుకున్నారు. తర్వాత ఆంజనేయస్వామి ఆలయం వీధిలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురి ఇళ్లకు వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. దీనిలో భాగంగా వలంటీర్లు, సచివాలయం సిబ్బందికి పలు సూచనలు చేశారు.

కోటికేశవరంలో పరామర్శ

కోటికేశవరంలో ఇటీవల మృతి చెందిన బూలా రాంబాబు కుటుంబ సభ్యులను సోమవారం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరామర్శించారు. ఆ కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటానని హామీ ఇచ్చారు. మృతుడి ఇద్దరు పిల్లలతో మాట్లాడారు. బాగా చదువుకోవాలని, ఆ కుటుంబానికి సంపూర్ణ సహకారాన్ని అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు మాట్లాడుతూ బాధిత కుటుంబాలను ఆదుకునేది జక్కంపూడి కుటుంబం మాత్రమే అన్నారు. ప్రతిపక్ష పార్టీ నాయకులు కుతంత్రాలకు పాల్పడుతున్నారని, ఇటీవల జనసేనలో చేరిన బత్తుల బలరామకృష్ణ నోరు పారేసుకుంటున్నారని విమర్శించారు. రాజానగరం నియోజకవర్గం అభివృద్ధి పరుగులు తీస్తూ, రాష్ట్రంలోనే ముందుందన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా కృషి చేయాలి

ఎంపీపీ కేతా తులసి



మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కేతా తులసి

పెదపూడి: అభివృద్ధే ధ్యేయంగా అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పర సహకారంతో కృషి చేయాలని ఎంపీపీ కేతా తులసి అన్నారు. పెదపూడి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కేతా తులసి అధ్యక్షతన సోమవారం మధ్యాహ్నం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ తులసి మాట్లాడుతూ అధికారులు సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. బాధ్యత రాహిత్యంగా వ్యవహరించే వారిపై నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో కాండ్రేగుల ఎంపీటీసీ సభ్యుడు పి.వెంకటరమణ, పుట్టకొండ సర్పంచ్ వి.వెంకటరమణ మాట్లాడుతూ గ్రామాల్లో మురుగు కాలువలు ఎందుకని ఆధునికీకరించడం లేదని అధికారుల్ని అడిగారు. వైద్య శాఖ నుంచి వైద్యులు సమావేశానికి హాజరుకాకపోతే వైద్య సమస్యలు ఎవరికి చెప్పాలంటూ పైన గ్రామ ఎంపీటీసీ సభ్యుడు ఎస్.సుధాకర్ ప్రశ్నించాడు. కరకుదురు గ్రామంలో జరిగిన కార్యక్రమాలకు తనను ఎందుకు ఆహ్వానించడం లేదని వైస్ ఎంపీపీ కర్రెడ్ల వెంకన్నబాబు ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ ఏఈ గంగాధర్‌ను నిలదీశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులపై ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులకు తెలియజేయాలన్నారు.

నిరంతర కృషీవలుడు కృష్ణారెడ్డి

నూతనంగా బాధ్యతలు చేపట్టిన అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి, బలోపేతానికి నిరంతరం శ్రమించే కృషీవలుడని ఎంపీపీ తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి అన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి నూతనంగా హాజరైన కృష్ణారెడ్డికి ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యురాలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయభాస్కర్, తహసీల్దార్ టి.సుభాష్, వైస్ ఎంపీపీ కర్రెడ్ల వెంకన్నబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

క్రికెట్ జట్టుకు అభినందన



క్రికెట్ జట్టును అభినందిస్తున్న కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం సిటీ: సమష్టిగా అడుగులు వేస్తే ఏ రంగంలోనైనా విజయం సాధించగలమని, ఇదే క్రీడా స్ఫూర్తిని విధుల్లో కూడా చూపించడం ద్వారా జిల్లాను అగ్రస్థానంలో నిలిపేలా పనిచేయాలని కలెక్టర్ మాధవీలత అన్నారు. ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌లో గెలుపొందిన కలెక్టర్ 11 టీమ్ సభ్యులు కెప్టెన్ కె.దినేష్ కుమార్, జేసీ తేజ్ భరత్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయం సాధించడంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యాన్ని కలెక్టర్ అభినందించారు.

- అమరావతి ఏపీజేఏసీ సభ్యులు సోమవారం కలెక్టర్ మాధవీలతను కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా వారికి కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. జేసీ చైర్మన్ ఎంకే ప్రసాదరావు, అసోసియేట్ చైర్మన్ ఎం.గాలిబ్ అహ్మద్, వైస్ చైర్మన్ కె.త్రిమూర్తులు, డాక్టర్ య.ముఖేష్, జనరల్ సెక్రటరీ ఏఆర్ శివకుమార్, ట్రెజరర్ ఎస్.స్వామినాధన్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధి పొందుతూనే విమర్శించడం తగదు



పందలపాకలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- పందలపాకలో గడప గడపకూ మన ప్రభుత్వం

బిక్కవోలు: ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి పొందుతూనే టీడీపీ నాయకులు ప్రభుత్వాన్ని విమర్శించడం తగదని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పందలపాకలో మూడో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల్ని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకతీతంగా ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కొంత మంది నాయకులు పథకాల నుంచి లబ్ధి పొందుతూనే ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు చేయడం సమంజసం కాదన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు సంక్షేమ పథకాలు అందకుండా చేయడమే టీడీపీ నాయకులు ధ్యేయంగా పెట్టుకున్నట్లు కనిపిస్తుందన్నారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీల అనుమతి ఉన్నవారికి, ముడుపులు ముట్టజెప్పినవారికి మాత్రమే సంక్షేమ పథకాలు అందేవని గుర్తుచేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సంక్షేమ సంఘం చైర్మన్ రొంగల పద్మావతి, ఎంపీటీసీలు కర్రి గీతా సావిత్రి, మచ్చాపాప, మాజీ జెడ్పీటీసీ కిలపర్తి సత్యనారాయణ, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ గండి వాసు, కొంకుదురు పీహెచ్‌సీ కమిటీ సభ్యుడు యాసలపు శ్రీనివాస్, పడాల కృష్ణారెడ్డి, ధరణకోట ఏసు తదితరులు పాల్గొన్నారు.

గ్రాసిం ఇండస్ట్రీస్ సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



పైన గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: బిక్కవోలు మండలం బలభద్రపురం గ్రామానికి చెందిన గ్రాసిం ఇండస్ట్రీస్ గ్రామాల్లో కల్చరల్ యాక్టివిటీస్ భవన నిర్మాణాలు చేపడుతూ చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. పైన గ్రామంలో గ్రాసిం ఇండస్ట్రీస్ సౌజన్యంతో నిర్మించే బీసీ కల్చరల్ యాక్టివిటీస్ భవనం నిర్మాణానికి ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామాల్లో గ్రాసిం ఇండస్ట్రీస్ ఈ భవనాలు నిర్మించడం చాలా శుభపరిణామమన్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనకు గ్రాసిం ఇండస్ట్రీస్ నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, సర్పంచ్ సుందరపల్లి ప్రమీల, ఎంపీటీసీ సభ్యుడు సుందరపల్లి సుధాకర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కొమరిపాలెంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

బిక్కవోలు: మండలంలోని కొమరిపాలెంలో గ్రాసిం ఇండస్ట్రీస్ సౌజన్యంతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి శంకుస్థాపన చేశారు. సోమవారం కొమరిపాలెం గ్రామంలో 5 కల్చరల్ యాక్టివిటీస్ భవనాలతో పాటు ఆర్వో ప్లాంట్ నిర్మాణం చేయడానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుమారు రూ.4 కోట్లతో గ్రాసిం ఇండస్ట్రీస్ చేపట్టిన నిర్మాణాలు ప్రజలకు వివిధ అవసరాల నిమిత్తం ఉపయోగపడతాయని, కొమరిపాలెం మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. గ్రామాల్లో అభివృద్ధికి సహకరిస్తున్న గ్రాసిం ఇండస్ట్రీస్‌ను అభినందించారు. కార్యక్రమంలోని ఏఎంసీ చైర్మన్ సబెళ్ళ కృష్ణారెడ్డి, జిల్లా మహిళా సంక్షేమ సంఘ చైర్‌పర్సన్ రొంగల పద్మావతి, ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి శేషుకుమారి, సర్పంచ్ వాసంశెట్టి రవి, ఉపసర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, గ్రాసిం ఇండస్ట్రీస్ యూనిట్ హెడ్ కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

రాములోరి రథానికి ఘన స్వాగతం



దివాన్ చెరువులో రామభక్తులకు అల్పాహారం పంపిణీ

రాజానగరం: లోకశాంతి, ప్రజాసంక్షేమాన్ని కోరుతూ కాకినాడలోని అచ్చంపేట నుంచి భద్రచలానికి రామనామ స్మరణతో వాసుదేవ గురుస్వామి ఆధ్వర్యంలో వెళ్తున్న రాములోరి రథం సోమవారం ఉదయం దివాన్ చెరువు చేరుకుంది. సుమారు 300 మంది రామభక్తులతో వెళ్తున్న ఈ రథానికి జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న లక్ష్మీ గణపతి ఆలయం వద్ద ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు గ్రంధి నానబ్బులు, కుటుంబ సభ్యులు స్వాగతం పలికారు. రామభక్తులకు అల్పాహారం అందజేశారు. ఉపాధ్యాయుడు జి.వెంకటరెడ్డి యాపిల్స్ వితరణ చేశారు. ఈ సందర్భంగా గురుస్వామి మాట్లాడుతూ ఏటా ఈ విధంగా రథంతో సుమారు 280 కిలోమీటర్లు దూరంలోని భద్రాచలంలో సీతారాముల దర్శనానికి పాదయాత్ర చేస్తున్నామన్నారు. ఈ నెల 4న కాకినాడలో ప్రారంభించిన ఈ యాత్ర 13 నాటికి భద్రాచలం చేరుకుంటుందన్నారు.

తాటాకిల్లు దగ్ధం



తంటికొండలో బాధితులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గోకవరం: మండలంలోని తంటికొండలో ఆదివారం రాత్రి తాటాకిల్లు దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే..స్థానిక ఎస్సీ కాలనీలోని ఆకుమూరి వెంకటేశులుకు చెందిన తాటాకింటి నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే స్థానికులు అప్రమత్తమై మంటలను అదుపు చేసినా ఫలితం లేదు. మంటలు వ్యాపించి ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో రెండు కుటుంబాలు నిరాశ్రయులు కాగా సుమారు రూ.లక్ష ఆస్తినష్టం సంభవించింది. విషయం తెలుసుకున్న గోకవరం ఎంపీపీ సుంకర శ్రీవల్లి, వీరబాబు దంపతులు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం బాధితులను పరామర్శించి రూ.3 వేలు నగదు, బియ్యం, నిత్యావసరాలు అందించారు. ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. తంటికొండ దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి రాంబాబు(రెడ్డి), సర్పంచ్ బద్దిరెడ్డి నారాయణమ్మ, అప్పన్నదొర, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు బాధిత కుటుంబాలకు చేయూతనందించారు. అలాగే స్థానిక టీడీపీ నాయకులు బాధితులకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

25, 26 తేదీల్లో గోదావరి బాలోత్సవం



బాలోత్సవ్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ తదితరులు

కంబాలచెరువు: పిల్లల్లో దాగిన సృజనాత్మకతను వెలికితీసేందుకు బాలోత్సవాలు ఎంతో దోహదం చేస్తాయని ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ అన్నారు. నగరంలోని ఓ హోటల్లో సోమవారం గోదావరి బాలోత్సవం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొని ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మాట్లాడుతూ ఇప్పటికే దేవరపల్లి, హేలాపురి ప్రాంతాల్లో నిర్వహించిన బాలోత్సవాలకు అద్భుతమైన రీతిలో స్పందన వచ్చిందన్నారు. అంతకుమించిన విధంగా ఈనెల 25, 26 తేదీల్లో రాజమహేంద్రవరం వేదికగా గోదావరి బాలోత్సవం నిర్వహించాలని, అందుకు అవసరమైన రీతిలో తన సహకారాన్ని అందించేందుకు కృషి చేస్తానన్నారు.

ఆహ్వాన కమిటీ ఏర్పాటు

గోదావరి బాలోత్సవం ఆహ్వాన కమిటీ ఏర్పాటైంది. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా షేక్.సాబ్జీ, గౌరవ సలహాదారుగా వి.భాస్కరరామ్, అధ్యక్షుడిగా తిరుమల విద్యాసంస్థల అధినేత నున్న తిరుమలరావు, గౌరవ సలహాదారుగా ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా ఓఎన్‌జీసీ మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీఎంఆర్ శేఖర్, ప్రధాన కార్యదర్శిగా పీఎస్ఎన్ రాజును నియమించారు.

పుస్తకాల పంపిణీ

కంబాలచెరువు: జాంపేట చాపల మార్కెట్ సమీపంలోని ప్రభుత్వ లూథరన్ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సోమవారం ఆల్‌ఇన్‌వన్ పుస్తకాలను పంపిణీ చేసారు. రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పదో తరగతిలో మంచి ఉత్తీర్ణత సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్ ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు.